బాలానగర్ డీసీపీగా కొల్లా సురేష్‌కుమార్



సురేష్‌కుమార్

జీడిమెట్ల,జూన్ 19(ఆంధ్రజ్యోతి): బాలానగర్ జోన్ డీసీపీగా కొల్లా సురేష్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన టి.శ్రీనివాస రావు జోగులాంబ గద్వాల్ ఎస్పీగా బదిలీ అయ్యారు. కొమరంభీం ఆసీఫాబాద్ ఎస్పీగా బాధ్యతలు నిర్వహించిన 2016 బ్యాచ్‌కు చెందిన కొల్లా సురేష్‌కుమార్ బాలానగర్ జోన్ డీసీపీగా బాధ్యతలు చేపట్టడంతో పలువురు అధికారులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అడిషినల్ డీసీపీ సత్యనారాయణ ఆయనకు స్వాగతం పలికారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

పెండింగ్ పనుల్లో అలసత్వంపై ఎమ్మెల్యే ఆగ్రహం

కూకట్‌పల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో భాగంగా ఎన్నికల ముందు విడుదలైన అభివృద్ధి పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో కార్పొరేటర్లతో కలిసి అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులతో బుధవారం సమావేశమయ్యారు. ముఖ్యంగా గతేడాది కాలంలో రూ.65 కోట్ల నిధులతో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ల నిర్మాణం కోసం శంకుస్థాపనలు చేసినప్పటికీ.. పనులు మాత్రం పూర్తిస్థాయిలో జరగకపోవడంపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో విడుదలైన నిధులకు సంబంధించిన పనులను ఎందుకు పెండింగ్‌లో పెట్టారని ప్రశ్నించారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం కార్పొరేటర్లను సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ముద్దం నర్సింహయాదవ్, రవీందర్‌రెడ్డి, సతీష్‌గౌడ్, శిరీష, అధికారులు చిన్నారెడ్డి, రమేష్, ప్రభాకర్‌రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గాంధీతో ఆల్విన్‌కాలనీ డివిజన్ ప్రజలు

సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్యేకు వినతి

వివేకానందనగర్‌కాలనీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్ బీ బ్లాక్, ఆల్విన్‌కాలనీ డివిజన్ మొగులమ్మబస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ ఆయా కాలనీ అసోసియేషన్ సభ్యులు బుధవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని సప్తగిరికాలనీలోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ, మంచినీరు, సీసీరోడ్ల నిర్మాణం వంటి సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే గాంధీ కాలనీవాసులకు హామీ ఇచ్చారు. సత్యంగౌడ్, మంగళి కృష్ణ, ప్రభాకర్, బాలాచారి, మల్లేష్, శివ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్

దుండిగల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): దేశ జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు కేంద్రంలో మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయకపోవడం దారుణమని తెలంగాణ బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే.మహేందర్ అన్నారు. బుధవారం కొంపల్లిలోని బీసీ ఐక్య వేదిక రాష్ట్ర కార్యాలయంలో మహేందర్ మాట్లాడుతూ.. బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత కూడా బీసీలను విమర్శిస్తోందన్నారు.కేంద్ర మంత్రి వర్గంలోకి తెలంగాణ ఎంపీల్లో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ని క్యాబినెట్‌లోకి తీసుకోవడం హర్షించతగ్గ విషయమన్నారు.

భూదేవిహిల్స్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

హైదర్‌నగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): భూదేవిహిల్స్ కాలనీలో డ్రైనేజీ, రోడ్లు నిర్మించాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్ కూకట్‌పల్లి ఉప కమిషనర్ కృష్ణయ్యకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. భూదేవిహిల్స్ ఏర్పడి 14 సంవత్సరాలు అవుతున్నా నేటికి మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్, జగద్గిరిగుట్ట డివిజన్ల మధ్యలో ఉండి అభివృద్ధికి నోచుకోలేదన్నారు.



పీజేఆర్‌కాలనీలో సమస్యలు పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

పీజేఆర్ కాలనీలో కార్పొరేటర్ పాదయాత్ర

హైదర్‌నగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్ కాలనీలో బుధవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అధికారులతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలను పరిశీలించి వాటిపై అధికారులతో చర్చించి వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో ప్రధానంగా డ్రైనేజీ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రోడ్లపై బిల్డింగ్ వ్యర్థాలు, చెత్త వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ ఝాన్సీ, వర్క్ ఇన్‌స్పెక్టర్స్ రవికుమార్, రవీందర్‌రెడ్డి, సూపర్‌వైజర్ నాగరాణి, నర్సింహులు, శివ పాల్గొన్నారు.

ఏసీ రిపేర్ కోసం ఫోన్ చేస్తే..

రూ.2.11 లక్షలు కొల్లగొట్టిన సైబర్ నేరగాడు

హైదరాబాద్ సిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఏసీ రిపేర్ కోసమని కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసిన వృద్ధుడిని ట్రాప్ చేసిన సైబర్ నేరగాడు అతని బ్యాంకు ఖాతా నుంచి రూ.2.11 లక్షలు కొల్లగొట్టాడు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన 62 ఏళ్ల వృద్ధుడు తన ఏసీ రిపేర్‌కు రావడంతో మరమ్మతులు చేయడానికి సామ్‌సంగ్ కస్టమర్ కేర్ నంబర్ కోసం గూగుల్‌లో వెతికాడు. అతనికి ఒక నంబర్ కనిపించగా దానికి ఫోన్ చేసిన బాధితుడు సమస్య చెప్పాడు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తి 'ముందుగా మీరు ఆన్‌లైన్‌లో రూ.5 పంపండి అప్పుడే మీ కంప్లైంట్ మా వద్ద రిజిస్టర్ అవుతుంది. ఆ తర్వాత టెక్నీషియన్ వచ్చి ఏసీ మరమ్మతులు చేస్తారు' అని నమ్మించాడు. అతని మాటలు నమ్మిన బాధితుడు యూపీఐ ఐడీని ఓపెన్ చేసి అతను చెప్పిన విధంగా చేశాడు. ఆ తర్వాత మెసేజ్‌లు చూసుకుంటే అతని బ్యాంకు ఖాతాలోని డబ్బులు డెబిట్ అయినట్లు తెలిసింది. దీంతో బాధితుడు అతనికి ఫోన్ చేసి ఇదేంటని నిలదీశాడు. దీంతో 'మీ డబ్బులు తిరిగి మీ ఖాతాకు బదిలీ చేస్తాను. అందుకు మీరు మీ మొబైల్ నుంచి కాకుండా వేరే నంబర్ నుంచి ఫోన్ చేయండి' అని చెప్పాడు. ఒక లింక్ వస్తుంది దాన్ని క్లిక్ చేయండి అని చెప్పడంతో బాధితుడు వాళ్ల అమ్మగారి ఫోన్ నంబర్ చెప్పాడు. ఆ నంబర్‌కు సామ్‌సంగ్ నుంచి వచ్చినట్లు ఒక లింక్ వచ్చింది. నిజంగానే కస్టమర్ కేర్ సర్వీస్ నుంచి వచ్చినట్లు ఉందని భావించిన బాధితుడు ఆ లింక్‌ను క్లిక్ చేసి అవతలి వ్యక్తి చెప్పినట్లుగా యూపీఐ ఐడీ వివరాలతో పాటు అన్ని వివరాలు నమోదు చేశాడు. ఆ తర్వాత వారి అమ్మ ఖాతా నుంచి కూడా డబ్బులు డెబిట్ అయ్యాయి. ఇలా మొత్తం రూ. 2.11 లక్షలు డెబిట్ అవడం, అవతలి వ్యక్తి కాల్ కట్ చేయడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫుట్‌పాత్‌లపై జోరుగా వ్యాపారాలు

- కుంచించుకుపోతున్న రహదారులు
- చేతివాటం చూపిస్తున్న జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ సిబ్బంది
- ఆక్రమణలు తొలగించక పోవడంతో ట్రాఫిక్ సమస్యలు



మియాపూర్ -హైదర్‌నగర్ రోడ్డులో ఫర్నిచర్ షాపుల వద్ద ఆగిన వాహనాలు

మియాపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలు తీసుకోకపోవడంతో ప్రధాన రహదారులు కుచ్చించుకుపోయి ఇరుకుగా మారుతున్నాయి. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో రోడ్డు విస్తర్ణ చేపట్టినప్పటికీ మరికొన్ని చోట్ల రోడ్ల విస్తరణ చేపట్టాల్సి ఉంది. మరికొన్ని ప్రాంతాల్లో విస్తరణ చేపట్టడానికి అవకాశం లేకపోవడంతో ఉన్న రోడ్లపైనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల అనేక ప్రధాన రహదారుల్లో పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లు నిర్మించారు. కానీ ఆ ఫుట్‌పాత్‌లు చిరువ్యాపారులకు అడ్డాగా మారాయి. దీంతో ఫుట్‌పాత్‌లపై వాహనాలు పార్కింగ్ చేయడంతో పాటు టిఫిన్ సెంటర్లు, వ్యాపారుల సామగ్రి పెడుతున్నారు. దీంతో పాదచారులు రోడ్లపైనే నడుస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఫలితంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది.

మియాపూర్ ప్రాంతాల్లో బొల్లారం చౌరస్తా నుంచి హైదర్‌నగర్ వరకు ఫుట్‌పాత్‌పై వ్యాపారం జోరుగా సాగుతోంది. ఈ ప్రధాన రహదారిలో కొనుగోలుదారుల వాహనాల పార్కింగ్ కారణంగా రోడ్లు కుంచించుకు పోవడంతో ప్రమాదాలు జరిగి ఇద్దరు మృతి చెందారు. అయినా ట్రాఫిక్, జీహెచ్ఎంసీ యంత్రాంగం ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించడం లేదు. దీనికి తోడు జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ కిందిస్థాయి సిబ్బంది వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేస్తు మిన్నకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కొంతమంది నాయకులు ఫుట్‌పాత్‌లపై పెట్టిన వ్యాపారుల నుంచి అద్దెలు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి. మైత్రినగర్ నుంచి మదీనగూడ వరకు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి సాయంత్రం 5 నుంచి అర్ధరాత్రి వరకు జోరుగా వ్యాపారం కొనసాగిస్తున్నారు. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ యంత్రాంగం చూస్తూ మిన్నకుంటోంది. చందానగర్, లింగంపల్లి, మాదాపూర్ ఇనార్బిట్‌మాల్, హఫీజ్‌పేట, దీప్తిశ్రీనగర్, ప్రశాంత్‌నగర్, జేపీఎన్‌నగర్, పాపిరెడ్డికాలనీ, గచ్చిబౌలి డీఎల్ఎఫ్, ఖాజాగూడ, రాయదుర్గం, పర్వత్‌నగర్, హఫీజ్‌పేట, కొండాపూర్, కొత్తగూడ ప్రాంతాల్లో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు కొనసాగుతున్నాయి. వీటి కారణంగా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని స్థానికులు, వాహనదారులు జీహెచ్ఎంసీ, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఈ ఆక్రమణలు తొలగించకపోతే భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని వాపోతున్నారు.

మహిళ అదృశ్యం



శ్రీదేవి

జీడిమెట్ల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైంది. జగద్గిరిగుట్ట పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. పాపిరెడ్డినగర్‌కు చెందిన కండ్లకుంట శ్రీదేవి(50) బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఆమె కోసం తెలిసిన వారు, బంధువులు ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకీ లభించ లేదు. దీంతో శ్రీదేవి భర్త సుబ్బారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సూరారంలో యువతి..



సంధ్య

గాజులరామారం: ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో బయటకు వెళ్లిన యువతి తిరిగి ఇంటికి రాలేదు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. సూరారం ఆర్‌జీకేలో ఉండే నరియానాయక్ కూతురు సంధ్య(20) ఈనెల 18న తల్లిదండ్రులు పనికి వెళ్లిన సమయంలో బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు సూరారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సురేష్ అనే వ్యక్తితో వెళ్లి ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సమయపాలన పాటించని వార్డు కార్యాలయ సిబ్బంది



అధికారుల కోసం వేచి చూస్తున్న జనం

గాజులరామారం, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయ అధికారులు సమయపాలన పాటించడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయ సమయం దాటిపోయినా ఆఫీసుకు తాళం తొలగడం లేదు. గాజులరామారం డివిజన్‌లోని మహాదేవపురంలోని వార్డు కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు కూడా సిబ్బంది రాలేదు. సమస్యలు విన్నవించుకోవడానికి వచ్చిన ప్రజలు అధికారులు, కార్యాలయం సిబ్బంది కొరకు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కార్పొరేట్ పాఠశాలను మూసేయాలి



ఆందోళన చేస్తున్న వ్యవస్థాపకులు, కరస్పాండెంట్స్

పేట్‌బషీరాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డ మూడుగుళ్ల సమీపంలో ప్రారంభిస్తున్న కార్పొరేట్ స్కూల్‌ను మూసేయాలని కుత్బుల్లాపూర్‌లోని గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం, కరస్పాండెట్లు బుధవారం ఆందోళన చేపట్టారు. అనంతరం స్కూల్ నుంచి సుచిత్రా చౌరస్తా వరకూ ర్యాలీ నిర్వహించారు. నూతన పాఠశాల ముందు ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేట్ పాఠశాలల వల్ల బడ్జెట్ పాఠశాలలు దెబ్బతింటున్నాయని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి కూడా తీసుకువెళ్లామన్నారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి.. మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్లను మూసివేయాలని విజ్ఞప్తి చేసినా ఫలితం లేదన్నారు. చింతల మహేష్‌కుమార్, రవికుమార్, మల్లేశం, గోవర్ధన్‌రెడ్డి, సుందరరాజు, వరప్రసాద్, గిరి, శ్రీనివాస్‌గౌడ్, రాజులు, వెంకట్, రఘు, శశిరేఖ, పద్మ, మోహన్‌తో పాటు దాదాపు 2 వందల మంది కరస్పాండెంట్స్ పాల్గొన్నారు.

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



ఎంపీ ఈటలను సత్కరిస్తున్న కోటేశ్వరరావు, వాణిశ్రీ

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 'నేను శామీర్‌పేటలోనే ఉంటున్నా.. మీకు ఎళ్లవేళలా అందుబాటులో ఉంటా' అని ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కేపీహెచ్‌బీ ఆరో ఫేజ్‌లోని మేడక కోటేశ్వరరావు, వాణిశ్రీ ఇంట్లో తేనేటీ విందుకు హాజరయ్యారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని తెలిపారు. ఎన్నికల్లో కష్టపడి పని చేయడమే కాదు.. గెలిపించి మరింత బాధ్యత పెంచారన్నారు. ఈ సందర్భంగా ఈటలను శాలువాతో సత్కరించారు. ఎంపీని కలవడానికి వచ్చిన అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఫొటోలు దిగారు. మల్కాజిగిరి ప్రజలకు సేవ చేసే అవకాశం ఇచ్చినందుకు ఓటర్లకు ఆయన దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు, ప్రీతంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈటలకు శుభాకాంక్షలు

హైదర్‌నగర్: ఈటల రాజేందర్‌ను భట్రాజు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి సీతారామరాజు, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ రాజు, శ్రీరామరాజు, శ్రావణ్‌కుమార్ రాజు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జేఎన్‌టీయూలో 27 మంది విద్యార్థులకు మెమోలు

వైస్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టిన కమిటీ

హైదరాబాద్ సిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన రెండు వేర్వేరు సంఘటనలకు సంబంధించి 27 మంది విద్యార్థులకు వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి మెమోలు జారీ చేశారు. ఈనెల 15వ తేదీన ప్రిన్సిపాల్‌ను సంప్రదించకుండానే యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట ఆందోళనకు దిగిన 12 మంది విద్యార్థులకు నోటీసులు జారీ చేశారు. అలాగే, ఈనెల 17న తమకు పెట్టిన అన్నంలో పురుగులు ఉన్నాయంటూ ఆందోళన చేసిన మరో 15 మంది విద్యార్థులకు కూడా మెమోలు ఇచ్చారు. బుధవారం కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ ఎదుట హాజరైన కొందరు విద్యార్థులు సంజాయిషీ ఇచ్చినట్లు తెలిసింది. మరికొందరు విద్యార్థులను పిలిపించి విచారించాల్సి ఉందని, విచారణ పూర్తికాగానే కమిటీ సిఫారసుల మేరకు చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ నర్సింహారెడ్డి తెలిపారు. విద్యార్థులు తమకేమైనా సమస్యలుంటే హాస్టల్ వార్డెన్లకు లేదా విభాగాధిపతులకు ముందుగా తెలియజేయాలని, అలా కాకుండా క్యాంపస్‌లో ప్రశాంత వాతావరణానికి భంగం వాటిల్లేలా ఆందోళనలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

లా పూర్తి చేసిన విద్యార్థులకు ఉచిత శిక్షణ

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): లా పూర్తి చేసిన బీసీ విద్యార్థులు మూడేళ్లపాటు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.ఆశన్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ జిల్లాకు చెందిన అర్హులైన బీసీ అభ్యర్థులు జూలై 4 వరకు లక్డీకపూల్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, సూర్తి భవన్ 4వ అంతస్తులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు వివరాలతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జీరాక్స్ ప్రతులు జతచేయాలని సూచించారు. అభ్యర్థులు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్‌చే గుర్తింపబడిన విద్యాసంస్థ నుంచి లా కోర్సులో ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. వార్షిక ఆదాయం రూ.2 లక్షలకు మించరాదని, బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకొని ఉండాలన్నారు.

ఏఐతో డబ్బు, సమయం ఆదా

- జేఎన్‌టీయూ రెక్టార్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి
- మ్యాథ్‌వర్క్స్ ఆధ్వర్యంలో 'ఇంజనీరింగ్ విద్యలో ఆధునిక పోకడల'పై వర్క్‌షాప్



జాతీయ వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, రెక్టార్ విజయకుమార్‌రెడ్డి, కన్వీనర్ మాధవీలత, మ్యాథ్‌వర్క్స్ ప్రతినిధులు జాహిదా వసీమ్, లక్ష్మీనారాయణ్

హైదరాబాద్‌సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో డబ్బు, సమయం ఎంతో ఆదా అవుతుందని జేఎన్టీయూ రెక్టార్ ప్రొఫెసర్ విజయకుమార్‌రెడ్డి అన్నారు. 'ఇంజనీరింగ్ విద్యలో ఆధునిక పోకడలు' అనే అంశంపై మ్యాథ్‌వర్క్ సంస్థ బుధవారం జేఎన్‌టీయూలో నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వర్క్‌షాప్‌నకు హాజరైన ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీ అధ్యాపకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత తరం విద్యార్థుల ఆలోచన విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు వినూత్న బోధనాపద్ధతులను అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను టెక్నాలజీ సాయంతో మరింత సులభంగా అందించే ప్రయత్నం చేయాలన్నారు. ఉపాధ్యాయులు నిత్యం పరిశోధన, పరిశీలనకు సంబంధించిన పుస్తకాలు చదవడంతో పాటు కొత్త ఆవిష్కరణలకు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విభాగంతో పాటు నేడు అభివృద్ధి చెందుతున్న ప్రతి రంగాల్లోనూ లక్ష్యాలను సాధించేందుకు సులభమైన మార్గాలు అనేకం ఉన్నాయన్నారు. ఈ తరహా వర్క్‌షాప్‌ల వలన అధ్యాపక వృత్తిలో మరింత మెరుగ్గా రాణించేందుకు వీలవుతుందన్నారు. జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో అనేక కొత్త ఆవిష్కరణలు వస్తున్నందున ఎదురయ్యే సమస్యల పరిష్కారాల కోసం పరిశోధన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ ఎం.మాధవీలత, ఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎ.రజని, మ్యాథ్‌వర్క్స్ ప్రతినిధులు జహీదా వసీమ్, డాక్టర్ లక్ష్మీనారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేసి రిజర్వేషన్లు పెంచాలి

ఖైరతాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో బీసీ కులగణన చేసి రిజర్వేషన్లను జనాబా ప్రాతిపదికన పెంచాలని, లేనట్లయితే బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని బీసీ సంఘాలు హెచ్చరించాయి. ఎన్నికల కోడ్ ముగియగానే కులగణన చేస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఆమేరకు పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలను చైతన్యపరచి ఉద్యమ బాట పట్టనున్నట్లు తెలిపారు. బుధవారం లక్డీకాపూల్‌లోని హోటల్ అశోకాలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీసీ మేధావులతో మేధోమదన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీని దృష్టిలో పెట్టుకుని దేశవ్యాప్తంగా బీసీలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తించాలన్నారు. ఆయన ఇచ్చిన మాటకు విరుద్ధంగా తెలంగాణ ప్రభుత్వం వ్యవహరించడం బాధాకరమన్నారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ మేధావులను చర్చలకు పిలిచి రిజర్వేషన్ల పెంపునకు మార్గదర్శకాలను విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా విశ్రాంత ఐఏఎస్ చిరంజీవులు బీసీలకు జరుగుతున్న అన్యాయంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు మాట్లాడుతూ బీసీ కులగణన చేపట్టేందుకు కేవలం 15 రోజులు సరిపోతుందని, తరువాత ఏ ఎన్నికలైనా జరపాలన్నారు. సదస్సులో ప్రొఫెసర్లు సింహాద్రి, తిరుమల, బీసీ సంఘాల నేతలు వీజీఆర్ నారగోని, గణేష్‌చారి, సురేష్, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్‌గౌడ్, బీసీ మేధావులు సుంకర సత్యనారాయణ, ప్రొఫెసర్ వినయ్‌బిబు, పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జడ్‌సీ స్నేహషబరీష్

వర్షాకాలంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

జడ్‌సీ స్నేహషబరీష్

గచ్చిబౌలి, జూన్19(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అప్రమత్తంగా ఉండాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషన్ స్నేహషబరీష్ అధికారులను ఆదేశించారు. బుధవారం జోనల్ కార్యాలయంలో మాన్‌సూన్ బృందాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనునిత్యం అప్రమత్తంగా ఉండి అవసరమైన ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా వర్షపునీరు నిల్వవుండే ప్రాంతాలను గుర్తించామని, నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. నాలాల ఆక్రమణలు తొలగించాలని, వర్షపునీరు ఆటంకం లేకుండా వెళ్లేలా చూడాలన్నారు. నాలాల్లో చెత్త, వ్యర్థాలు పేరుకు పోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. నీటి నిల్వ ప్రాంతాల్లో చేపట్టే చర్యలను ఎప్పటికప్పుడు నివేదించాలని, అదేవిధంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పలు విభాగాలతో సమన్వయంతో ముందుకు సాగాలన్నారు.

జేఎన్‌టీయూలో బీ పార్మసీ కోర్సు

హైదరాబాద్ సిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీలో ఈ విద్యా సంవత్సరం (2024-25) కొత్తగా బీ పార్మసీ కోర్సును ప్రారంభించేందుకు అనుమతిస్తూ రిజిస్ట్రార్ డా. కే వెంకటేశ్వరరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంజనీరింగ్ కాలేజీలోని సెంటర్ ఫర్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో ప్రస్తుతం ఎం పార్మసీ కోర్సులు నడుస్తుండగా, ఈ ఏడాది నుంచి 60 సీట్లతో బీ పార్మసీ కోర్సు ప్రవేశపెట్టాలని సదరు విభాగాధిపతి ప్రతిపాదించారని, ఆ ప్రతిపాదనలకు ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ ఆమోదం తెలిపినట్లుగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా కొత్తగా అనుమతించిన బీ పార్మసీ కోర్సు 60 సీట్లలో 30 సీట్లు రెగ్యులర్ కేటగిరీ, మరో 30 సీట్లు సెల్ఫ్‌ఫైనాన్స్ కేటగిరి కింద విభజించారు.

నల్సార్‌లో ఇద్దరు విశిష్ట ప్రొఫెసర్ల నియామకం

గోపాలకృష్ణగాంధీ, సాయినాథ్ ఎంపిక



ప్రొ.సాయినాథ్ ప్రొ.గోపాలకృష్ణగాంధీ

శామీర్‌పేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని నల్సార్ యూనివర్సిటీ విశిష్ట ప్రొఫెసర్లుగా మాజీ గవర్నర్, దౌత్యవేత్త గోపాలకృష్ణగాంధీ, ప్రముఖ పాత్రికేయుడు, మెగసెసే అవార్డు గ్రహీత సాయినాథ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నల్సార్ వైస్ చాన్స్‌లర్, ప్రొ.కృష్ణదేవరావు మాట్లాడుతూ విశిష్ట ప్రొఫెసర్ అనే పదవికి ప్రజాక్షేత్రంలో అత్యంత గొప్పసేవ చేస్తున్న మేధావులను గుర్తించి, నల్సార్ విశ్వవిద్యాలయంలో విద్యాపరంగా వారి సేవలను వినియోగించుకోనున్నట్లు తెలిపారు. న్యాయ విద్య పరిధిని విస్తృతం చేసి, లా విద్యార్థులకు, న్యాయ భావన జస్టిస్‌కు అనేక ప్రధాన ప్రశ్నలను పరిచయం చేయాలని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆ దిశగా ఈ మేధావులను విశిష్ట ప్రొఫెసర్లుగా నియమించి ఒక ముందడుగు వేసినట్లు వివరించారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు, చట్టానికి, సామాజిక ఆర్థిక న్యాయానికి మధ్య ఉండే సంబంధాన్ని ఈ మేధావులు వివరిస్తారని ఆయన తెలిపారు.

బోర్డు తిప్పేసిన సాఫ్ట్‌వేర్ కంపెనీ

- రూ.18 లక్షలకు టోకరా
- పరారీలో నిందితులు

రాయదుర్గం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఐటీ జోన్‌లో మరో సాఫ్ట్‌వేర్ కంపెనీ బోర్డు తిప్పేసింది. గచ్చిబౌలిలో ఓ కంపెనీ నిర్వాహకులు ఫ్రెషర్స్‌కు ఉద్యోగాలు ఇస్తామంటూ సెక్యూరిటీ డిపాజిట్ పేరుతో సుమారు రూ.18 లక్షలు వసూలు చేసి దుకాణం ఎత్తేశారు. ఈ మేరకు బాధితుడు మాదాల యశ్వంత్, మరికొందరు రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం... గచ్చిబౌలి టెలికాంనగర్‌లోని రేల్‌వరల్డ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఓ యువతికి గతనెల 9న ఫోన్ వచ్చింది. తమ కంపెనీలో ఫ్రెషర్లకు ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని ఇంటర్వ్యూకు హాజరు కావాలని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఆ యువతికి నిర్వహించిన ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయినట్లు కంపెనీ హెచ్‌ఆర్ దీక్షాశిండే, కంపెనీ డైరెక్టర్లు సుప్రిత్, రమ్య, ప్రకాష్‌సింగ్ తెలిపారు. అయితే 100 రోజుల శిక్షణ అనంతరం ఉద్యోగం ఇస్తామని చెప్పారు. సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.40వేలు చెల్లించాలని, ఆ మొత్తాన్ని శిక్షణ అనంతరం ఇస్తామని చెప్పడంతో డబ్బు చెల్లించింది. ఈనెల 3 నుంచి 13 వరకు ఆమెతో పాటు మరో 10 మందికి శిక్షణ ఇచ్చారు. తండ్రి అనారోగ్యం కారణంగా 14 తేదీన సెలవు ఇస్తున్నట్లు డైరెక్టర్ ప్రకాష్‌సింగ్ అభ్యర్థులకు వాట్సాప్ మెసేజ్‌లను పంపించాడు. ఆ తర్వాత కార్యాలయానికి తాళం వేసి ఉండటం చూసి ఇతర రాష్ట్రాల్లో ఉన్న బ్రాంచ్‌లకు ఫోన్ చేశారు. గతంలోనే అక్కడ యాజమాన్యంపై కేసులు నమోదైనట్లు తెలుసుకుని తాము మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. సుమారు 49 మంది నుంచి రూ.18లక్షలు వసూలు చేసినట్లు గుర్తించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కాఫీ కథను తెలియజేసిన 'క్రాఫ్టింగ్ కాఫీ కల్చర్'



కాఫీని ఆస్వాదిస్తున్న చాందిని

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తోట నుంచి కప్పులోకి చేరే వరకు కాఫీకి ఉన్న ప్రయాణ కథను తెలియజేసేలా మాదాపూర్‌లోని ద కోరమ్‌లో బుధవారం క్రాఫ్టింగ్ కాఫీ కల్చర్ పేరిట ఓ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫస్ట్ క్రాక్ స్పెషాలిటీ రోస్టర్స్ సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాఫీ ప్రియులు, సాగుదారులు, కేఫ్ యజమానులు, స్పెషాలిటీ కాఫీ కమ్యూనిటీకి చెందిన నిపుణులందరినీ ఒకేచోటకు చేర్చి స్పెషాలిటీ కాఫీలను చర్చించింది. రత్నగిరి ఎస్టేట్ నుంచి తీసుకు వచ్చిన స్పెషాలిటీ కాఫీలను ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన చర్చా కార్యక్రమంలో రత్నగిరి ఇంటర్నేషనల్ మేనేజింగ్ పార్టనర్ అశోక్ పాత్రే మాట్లాడుతూ హై-గ్రేడ్ స్పెషాలిటీ ఇండియన్ కాఫీని పండించడంలోని సవాళ్లు, కాఫీ ప్రాముఖ్యతను వివరించారు. ఫస్ట్ క్రాక్ స్పెషాలిటీ రోస్టర్స్ వ్యవస్థాపకురాలు చాందిని ఎస్ఆర్‌కే మాట్లాడుతూ కాఫీ రైతులు, వినియోగదారుల మధ్య అంతరాన్ని తగ్గించడమే తమ లక్ష్యమని అన్నారు.